

# నేరం చేయని నేరస్థుడు

మోర్తల గోపాలరెడ్డి

నేను అనుకున్నట్టుగానే ఆ రోజు రైలు రెండుగంటలు లేటు. ఎక్కడో చదివిన వాక్యం మదిలో మెదిలింది - నువ్వు ఎక్కాలనుకున్న రైలు ఎప్పుడూ జీవితకాలంలేటు - సూట్‌కేస్ చేతపట్టుకుని వెయిటింగ్ హాల్‌కొరకు కలయచూశాను ప్లాట్‌ఫారం చివర ఓ బోర్డు కనిపించి ఆ వైపు నడిచాను. బుక్‌స్టాల్‌వద్ద రెండు మ్యాగజైన్లు కొనుక్కుని నేను ఎదురుచూడబోయే రైలును తిట్టుకుంటూ వెయిటింగ్ రూంవద్ద కొచ్చాను. ఎందుకయినా మంచిదని ఓసారి లోపలకుతొంగిచూదాను ఓ స్త్రీ- ముగ్గురుపిల్లలు కనిపించారు. ఆమె ఒకత్తే వుండకంవల్ల నేను కొంచెం సందేహించి లోపలకు వెళ్ళాను. ఆమెకి ఓ పదిగజాలదూరంలో వున్న రివాల్వింగ్‌కుర్చీ ప్రక్కన సూట్‌కేస్‌పెట్టి ఆ కుర్చీలో కూర్చున్నాను. వాటిలో చిన్నముల్లు పెద్దముల్లు తొమ్మిదిదగ్గర పరపమాడు కుంటున్నాయి

ఆ స్త్రీ నన్ను గమనించినట్టులేదు. ఆమె మొహానికి అడ్డుగా ఈవ్స్‌వీక్లీవుంది. ఎనిమిదేళ్ళ అమ్మాయి ఆమెప్రక్కన కూర్చుని యింగ్లీష్ కామిక్‌లో బొమ్మలుచూస్తోంది. ఆ అమ్మాయి ఓసారి నన్నుచూసి తిరిగి తనపనిలో నిమగ్నురాలయింది ఓ పదేళ్ళకుర్రాడు బహూశా ఆ అమ్మాయి అన్న అయివుంటాడు. స్విచ్‌బోర్డువద్ద నిలబడి మానేపు ఫ్యాన్ ఆఫ్‌చేస్తున్నాడు. మళ్ళా ఆన్‌చేస్తున్నాడు. మళ్ళా ఆఫ్‌చేస్తున్నాడు. ఆ స్విచ్‌ను చిత్రహింసల పాలుచేస్తూ ఏదో దాన్ని తనొక్కడే ఆనందిస్తున్నాడు ఐదేళ్ళపాప గదిలో అటూఇటూ తిరుగుతూ తనతానే మాట్లాడుకుంటూ గంతులేస్తుంది పిల్లల్నిచూస్తే చాలా నీటుగావున్నారు మంచి క్రమశిక్షణలో పెంచబడ్డారని తెలుస్తుంది కుర్రాడు ఫాన్ స్విచ్‌మీదనుంచి తనకంఠయాత్రను లైట్‌స్విచ్‌లమీదికి మళ్ళించాడు. గదిలోలైట్లు ఆరిపోయాయి

"వాట్స్‌దట్ కమియర్" అంది ఆ స్త్రీ కొంచెం కోపం, ఆజ్ఞ మేళవించినస్వరంతో. కుర్రాడ లైట్లు ఆన్‌చేసి సర్కస్ కోతిలా నడుస్తూవచ్చి ఆమె ముందు నిలబడ్డాడు.

'సిట్ హియర్" అంది.

చేతులు కట్టుకుని కుర్రాడు ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

ఇదంతా గమనిస్తున్న నాకు ఆమె మొహం చూడాలనే ఆతృత హెచ్చింది. కానీ ఆమె ఆ ఈవ్స్ వీక్లీని ప్రక్కకు పెట్టేట్టు కనిపించలేదు.

రెండుసార్లు పొడిదగు దగ్గాను ఆమె దృష్టిని ఆకర్షించాలని.

పొడిదగు కొంచెం పనిచేసింది నాటుమందులా.

పత్రికను కొంచెం ప్రక్కకు తొలగించింది. ఒక కన్నుమాత్రం కనిపించింది. కళ్ళకు జోడు వుంది. మొహం కనిపించలేదు. మనిషిని పూర్తిగా చూడాలనే వుబలాటం స్క్వేర్ రూట్‌లా పెరిగింది.

"కమాన్ బేబీ" అన్నాను గదిలో ఏకపాత్రాభినం చేస్తున్న ఐదేళ్ళ పాపను వుద్దేశించి.

ఈసారి నా పథకం ప్రకారం ఆమె మ్యాగజైన్ తీసి వొళ్ళో పెట్టుకుని నా వైపు చూసింది.

నేను ఆమెను చూశాను.

ఇంకా యింకా చూశాను.

కనుబొమలు ముడిపడ్డాయి ... మ్యానిఫోల్డు పేపర్లోంచి చూసినట్టు అస్పష్టంగా పన్నెండేళ్ళనాటి గతం .. మసక మసగ్గా... మూకీచిత్రపు ఫ్రేములా కళ్ళముందు కనిపించింది... ప్రభాకర్... రామనాథం .. రంగరాజు... మిసెస్ డిసిల్వా... తాళకాలు సుళ్ళు తిరుగుతున్నాయి.

* * *

ఓ ఆదివారం నాడు ప్రభాకర్ నన్ను భోజనానికి పిలిచాడు. మా యింటినుంచి తార్నాకావరకు బస్‌లో వెళ్లాను. అక్కడ బస్ దిగి ప్రభాకర్ యిచ్చిన కాగితంలో అడ్రస్ వెతుక్కుంటూ ఆ వీధిలో తిరుగుతున్నాను.

"మిస్టర్ మూర్తి" అన్న పిలుపు వినిపించింది. కొద్దిదూరంలో యినుప వూచల గేటువద్ద నిలబడి చెయ్యి వూపుతూ నిలబడ్డ మిసెస్ డిసిల్వా కనిపించింది. ఆమె వద్దకెళ్ళాను.

"రండి" అంటూ వాళ్ళింట్లోకి తీసుకెళ్ళింది.

మిసెస్ డిసిల్వా కూడా మా ఆఫీసులోనే పని చేస్తుంది. నాకు అంతవరకూ ఆవిడతో మాట్లాడాల్సిన అవసరం, అవకాశం కలగలేదు. నాకంటే ఐదారేళ్ళు పెద్దది. మనిషి చాలా నెమ్మదస్తురాలు. ఆమెను చూస్తే ఎలాటివాడికైనా ఆమె మీద సదభిప్రాయం ఏర్పడుతుంది ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడదు. తన పని చూసుకుని వెళ్ళిపోతుంది. అంతకుమించి నాకు ఆమె గురించి ఎక్కువ తెలీదు తెలుసుకోవాలని నేను ప్రయత్నించ లేదు కూడా.

కొంచెం జంకుతూ వాళ్ళ యింట్లో అడుగు పెట్టాను. రెండు గదులు. ఒక చిన్న వంటిల్లు. ముందుగదిలో ఓ పాత పేము సోఫాలో కూర్చోమంది. కూర్చుని నలుమూలలా కలయ చూశాను.

నేను యింతకు ముందు చూసిన ఆంగ్లోయిండియన్ యిళ్ళకూ, ఈ యింటికీ చాలా భేదం కనిపించింది. ఇల్లు చాలా పరిశుభ్రంగా ఎక్కడి వస్తువులు అక్కడ తీర్చిదిద్దినట్టుగా వున్నాయి క్రీస్తు జననం మేరీ, శిలువ వేయబడ్డ ఏసుక్రీస్తు తదితర మత సంబంధమయిన పటాలు గోడలకు తగిలించబడి వున్నాయి. అన్నిటి కంటే నన్ను బాగా ఆకర్షించింది మర్ఫీ క్యాలెండరు. బోసి నవ్వులు చిలకరిస్తూ కుడివేలు బుగ్గమీద పెట్టుకొనివున్న పాప బొమ్మ వుంది. అదెప్పటో నాలుగేళ్ళ నాటి పాత క్యాలెండరు అయినా ఆ క్యాలెండరు తొలగించకుండా వుంచడం వల్ల ఆ పాప బొమ్మ అంటే మిసెస్ డిసిల్వాకు చాలా యిష్టం అనే విషయం స్పష్టమయింది.

'మా యిలు అదేపనిగా చూస్తున్నారు. దేని కోసమయినా వెతుకుతున్నారా?" అంది నవ్వుతూ నేను తడబడి ఆమెవైపు చూసి నవ్వాను.

"ప్రభాకర్ కోసం వచ్చారా?"

"అవును యిలుకోసం వెతుకుతున్నాను'

"మాయింటికి దగ్గర్లోనేవుంది తర్వాత చూపిస్తా. కూర్చోండి యిప్పుడే వస్తాను' అంటూ లోపలికి వెళ్ళింది టేబిల్ మీద కనిపించిన బైబిల్ అందుకుని పేజీలు తిరగేయసాగాను. ఓ గ్లాస్ ఫ్రూట్ జ్యూస్‌తో మిసెస్ డిసిల్వా వచ్చింది.

మీరు కాఫీ తాగరు కదూ' అంటూ జ్యూస్ గ్లాస్ నాచేతికిచ్చింది. నాకూ, ఆమెకు పెద్ద పరిచయం లేకపోయినా నేను కాఫీ తాగననే విషయం ఆమెకెలా తెలిసిందబ్బా అనుకుంటూ గ్లాసు అందుకుంటూ అన్నాను నేను కాఫీ తాగనని మీ కెలా తెల్సు"

'మొన్న టైమ్స్ ఆఫ్ ఇండియాలో చదివాను' అంది కిలకిల నవ్వుతూ జ్యూస్ గ్లాస్ పెదాలవద్ద పెట్టుకుంటూ. మిసెస్ డిసిల్వాను చూశాను గోడకు ఆనుకొని కిటికీలోంచి బయటకు చూస్తోంది. సీరెండ ఆమె చెంపలమీద పడుతోంది. ఆమె కళ్ళలో ఏదో అశాంతి గోచరించింది. జీవితంలో ఏదో కొరత పడ్డట్టు కనిపిస్తోంది. ఆమెను అడుగుదామని నాలుక చివరిదాకా వచ్చింది. కానీ అంత చొరవ తీసుకోవడం సభ్యత కాదనిపించి, ఆ ప్రయత్నానికి కళ్ళెంవేశాను.

జ్యూస్ పూర్తిచేసి 'థ్యాంక్స్' అన్నాను.

ఆమె నా వద్దకొచ్చి గ్లాసు తీసుకోడానికి ఒంగినపుడు ఆమె చేతికి యేదో కట్టుకున్నట్టు అనిపించి పరీక్షగా చూశాను. అదొక తాయెతు. తాయెతులపై సామాన్యంగా ఆంగ్లోయిండియన్లకు నమ్మకంవుండదు మిసెస్ డిసిల్వా తాయెతు యెందుకు కట్టుకుందో నాకు బోధపడలేదు. తెలుసుకోవాలన్న కుతూహలం యెక్కువయింది.

"ఒక్క విషయం అడిగితే మీరేమీ అనుకోరు గదా?" అన్నాను.

ఆమె నవ్వింది. "అడగండి" అంది.

ఆమె చేతిని చూస్తూ 'మీకు హిందూ మత మంటే నమ్మకముందా?" అన్నాను

నా మాటలు ఆమెకు అసందర్భంగా అనిపించినట్టుంది.

ఏం అలా అడిగారు?" మళ్ళా నన్నే ప్రశ్నించింది.

మరేంలేదు మీ చేతికి తాయెతు కనిపించింది అందుకని అడిగాను'

ఆమె మొహంలో నే నూహించని మార్పు కనిపించింది. సడన్‌గా షాక్ తిన్నట్టు మనిషి అటు తిరిగింది. కట్టలు త్రెంచుకుని ప్రవహించబోయే కన్నీటిని నేను ఎరిగించకూడదని బహుశా ఆమె అలా చేసి వుంటుంది వెక్కివెక్కి యేడుస్తున్నట్టు అనిపించింది ఆమె యెందుకు ఏడుస్తున్నదో నాకు అర్థంకాలేదు సముదాయిద్దామన్న వుద్దేశంతో లేచి రెండడుగులువేశాను ఏం మాటాడాలో తెలియలేదు. దుఃఖంతో బాధపడుతున్న ఆడవాళ్ళతో ఎలా సంభాషణ మొదలు పెట్టాలో నాకు బొత్తిగా అనుభవం లేదు.

మిసెస్ డిసిల్వా ... అయాం వెరీ సారీ" అన్నాను.

రెండు చేతులతో కళ్ళు తుడుచుకుని నా వైపు తిరిగింది. ఆమె కళ్లు ఎర్రగావున్నాయి మొహం కందిపోయినట్టుగావుంది. కన్నీరు అక్కడక్కడ యింకా బుగలమీద వుంది శోకవాహినిలో మునిగి తేలినట్టుగా కనిపిస్తున్న ఆమెను చూడ్డంతప్ప నేను మాట్లాడలేకపోయాను.

---

ఒక ప్రముఖ మంత్రిగారు ఆయన సెక్రెటరీని పిలచి ఇలా కోప్పడ్డారు.

' నే నిచ్చే ఉపన్యాసంలో అంతకష్టమైన పదాలు వాడితే ఎలాగయ్యా? నే మాట్లాడిన దేమిటో నాకు తెలియటంలేదు. పైగా అంత పెద్దమాటల పలకడానికి నాకు 'నోరు' తిరగొద్దూ!'

— డి. వి. రాఘవానంద్

---

ఆమె పెదాలు కదిలాయి. ఏదో చెప్పబోతోంది.

బయట తలుపువద్ద అలికిడయింది. ఓ ముప్పై ఏళ్ళ వ్యక్తి - ఆమె భర్తలా కనిపించాడు. లోపలకు వచ్చాడు.

మిసెస్ డిసిల్వా పరిచయంచేసింది. నేను అనుకున్నది కరక్టే, అతను రైల్వేలో ఫోర్‌మన్. మనిషి అంత ఆకర్షణీయంగా లేకపోయినా హృదయం పాలరాతికంటే స్వచ్ఛంగా వుందని పించింది బహుశా అతని హృదయ సంస్కారమే వాళ్ళిద్దర్నీ భార్యాభర్తలుగాచేసి వుంటుందను కున్నాను. కొంతమంది మనుష్ల్ని చూడగానే మనకు మొదట్లో మంచి అభిప్రాయం ఏర్పడదు. వాళ్ళతో పరిచయం అయ్యాక కొంతకాలానికి వాళ్ళే మనకు చాలా సన్నిహితులవుతారు. ఓ పావుగంటసేపు రైలింజన్ల గురించి, అతని ప్రమోషన్‌గురించి, రైలుపెట్టెల్లోవుండే పంకాలగురించి మాట్లాడాడు. నాకు కొంచెం విసుగుపుట్టింది. నాకు నేను వదిలించుకుంటేతప్ప వాడిలే రకంలాలేడు.

ఓసారి వాచ్ చూసుకుంటున్నట్టు చేసిలేచాను. "వస్తానండి అవతల ప్రభాకర్ నా కోసం చూస్తుంటాడు" అన్నాను,

అడగానే మా యింటికివచ్చినందుకు చాలా థాంక్స్" అంది మిసెస్ డిసిల్వా.

ఇద్దరివద్ద శలవుతీసుకుని బయటికొచ్చాను. నా వెనకాలే మిసెస్ డిసిల్వాకూడా వచ్చింది.

కొంచెం దూరంలో కనిపిస్తున్న ప్రభాకర్ యిల్లు చూపించింది.

థాంక్స్" అంటూ గేటుదాటి బయటికొచ్చాను. తాయెతుగురించి అడిగినప్పుడు మిసెస్ డిసిల్వా ఎందుకు ఏడ్చిందోనని ఆలోచించసాగాను. తల బ్రద్దలుకొట్టుకున్నా అంతుచిక్కలేదు

నేను వెళ్ళేసరికి ప్రభాకర్ వరండాలో నిలబడి వున్నాడు. నా కోసమే చూస్తున్నట్టుంది. జూలో సింహంలా అటూయిటూ తిరుగుతున్నాడు.

ఇంత ఆలస్యమైందేం అన్నాడు.

దారితప్పావా?'

'చికెన్ ఫ్రై వదులుకోవని నాకు తెల్సు'.

ప్రభాకర్ ఓ చిత్రమైన మనిషి అతను తెలుగువాడైనా ఎప్పుడూ హిందీలో మాట్లాడుతుంటాడు. ఎదుటి వాడిని తన మాటలతో చాలా తేలికగా ఆకర్షించగల నేర్పు అతనిలో వుంది అతను అందరితో మాట్లాడడు, ఎక్కువగా మాట్లాడడు. మాట్లాడినంతసేపు హుషారుగా మాట్లాడతాడు.

మీ ఇంటికోసం వెతుకుతుంటే మిసెస్ డిసిల్వా పిలిచింది. ఇప్పటిదాకా అక్కడే వున్నాను' అన్నాను.

'సరేలే ముందు భోజనంచేద్దాం ఆకలి దంచేస్తోంది అన్నాడు.

ఇద్దరం భోజనం ముగించాం. వంటకాలు బావుండడంవల్లనో నా కిష్టమయిన చికెన్ ఫ్రై, మజ్జిగ పులుసు వుండడంవల్లనో పుష్టిగా భోంచేశాను.

ప్రభాకర్ యిచ్చిన కింగ్, త్రీకాజిల్స్ తీసుకున్నాను. సిగరెట్టుపొగ రింగులు రింగులుగా వదులుతూ మిసెస్ డిసిల్వా యింట్లో జరిగినదంతా చెప్పి 'ఆవిడ అలా ఎందుకేడ్చి వుంటుందో నీకేమయినా తెలుసా?" అని అడిగాను.

ప్రభాకర్ సిగరెట్టు పొగ గుండెలదాకా పీల్చి, అర్ధనిమీలిత నేత్రాలతో తల కుర్చీకి ఆన్చి సన్నగా నవ్వి "ప్రపంచంలో రకరకాల దురదృష్టవంతులుంటారు. డబ్బులేక బాధపడే దురదృష్టవంతులు: డబ్బు ఎక్కువయి మానసిక శాంతిలేని దురదృష్టవంతులు; పిల్లలతో దరిద్రాన్ని అనుభవించే దురదృష్టవంతులు: పిల్లలకోసం పరితపించే దురదృష్టవంతులు; మిసెస్ డిసిల్వాకు పిల్లలంటే ప్రాణం. ఆవిడకు పెళ్ళయి ఆరేళ్ళయింది. ఈ ఆరేళ్ళలో ముగ్గురు పిల్లలు పుట్టారు. కానీ పుట్టిన మూడోనాడే వాళ్లు చచ్చిపోయారు. తల్లి కావాలన్న ఆమెకోరిక తీరని కోరికగానే మిగిలిపోయింది. ఇరుగుపొరుగు పాపలను తెచ్చుకుని కాసేపు ఆడించుకుని తాత్కాలికంగా తల్లినయ్యానని తృప్తిపడుతుంది. పాపల ఫొటోల ఆల్బం చూసుకుని మానసికంగా వుపశమనం పొందుతుంది. మర్ఫీ క్యాలెండర్లో వుండే ఆ పాపాయంటే ఆవిడకు అమిత యిష్టం.

పత్రికాయినాగా పద్ధతడిత ఆయన ఆమెకా తాయెతు విభూతి యిచ్చాడు. ఆ తాయెతు గురించి నువ్వు అడిగినప్పుడు అందుకే ఆమె దుఃఖించి వుంటుంది. ఆమెకు ఈ ఆవేదన ఎప్పుడు తొలగిపోతుందో! ఎప్పుడు ఆమె తన పాపతో సంతోషంగా వుంటుందో! ఆమె హృదయంలో ఎప్పుడు పన్నీటి జల్లులు కురుస్తాయో!' అన్నాడు.

ప్రభాకర్ చెప్పినదంతా విన్నాక మిసెస్ డిసిల్వా మీద నాకున్న గౌరవం రెట్టింపయింది. భగవంతుడనే వాడంటూ ఒకడుంటే ఆమె పట్ల ఎందుకు యింత పక్షపాతంగా వున్నాడబ్బా అనుకున్నాను.

సాయంత్రం వరకూ రికార్డ్ ప్లేయర్‌తో కాలం గడిపి శలవు తీసుకుని యింటికి బయలుదేరాను. నా చూపులు మిసెస్ డిసిల్వా యింటివైపు పరుగులు తీశాయి. యింట్లో దీపాలు వెలుగుతూ కనిపించాయి. మిసెస్ డిసిల్వా హృదయంలో కూడా అలాటి దీపాలు వెలిగించమని సృష్టికర్తను ప్రార్థించాను ఆ నిశ్శబ్ద నిశీథిలో. యూదుల చేతుల్లో శిలువ వేయబడి వారి ప్రపంచాన్ని చూడలేక తల ప్రక్కకు వొంపుకున్న ఏసుప్రభువును కళ్ళు తెరవమని వేడుకున్నాను.

కాలచక్రం ఓ ఆరేడు నెలలు తిరిగిపోయింది మిసెస్ డిసిల్వా మూడునెలల మెటర్నిటీ లీవ్ తీసుకుందని తెలిసినప్పుడు నాకు కలిగిన ఆనందం అంతాయింతా కాదు. ఈ సారయినా ఆమెకు కడుపు కోత లేకుండా చెయ్యమని నా మనసులో మొక్కుకున్నాను. ప్రభాకర్‌ను ప్రతిరోజు అడుగుతూనే వున్నాను–అమ్మాయా? అబ్బాయా? అని

నా తొందరపాటుకు ప్రభాకర్ నవ్వేవాడు.

సినిమాటికెట్ కొరకు క్యూలో నిలబడాలన్నా సిటీబస్ కొరకు కొంగ జపం చేస్తూ గుడ్లగూబలా బస్ స్టాప్ వద్ద నిలబడాలన్నా, సినిమా వార్తలు లేని పత్రికలు చూడాలన్నా నాకు తగని వొళ్ళు మంట. ఆ వొళ్ళు మంట యిప్పుడు మరీ ఎక్కువైంది. అది వేరే విషయ మనుకోండి. కారు గానీ స్కూటర్ గానీ కొనుక్కునే తాహతు నాకు లేదు. కాబట్టి వచ్చినట్టు వెళ్ళి బస్‌స్టాప్‌వద్ద నిలబడేవాణ్ణి. పదిన్నరకు ఆఫీసయితే తొమ్మిదిన్నర నుండి బస్ స్టాప్ వద్ద మంగళగిరి చాంతాడంత క్యూలో పిపీలికంలా నిలబడాలి. మనం నిలబడే వుంటాము. బస్సులు మాత్రం అంతరిక్షపు నౌకల కంటే వేగంగా మనల్ని చూసి నవ్వుకుంటూ బస్ స్టాప్ వద్ద ఆగకుండా పోతాయి ఏదో గారడి వింతను చూస్తున్నట్టు చూడడం తప్ప మనమేమీ చేయలేము డ్రైవర్ కొంచెం తెలివైన వాడైతే బస్ స్టాప్‌కు దూరంగా బస్ ఆపుతాడు. ఆ బస్‌ను అందుకోవాలనే ఆతృతలో శరీరంలోవున్న బలాన్నంత కూడగట్టుకొని మనం పరుగెత్తేలోపల అది కాస్తా తుర్రుమంటుంది. ప్రతి క్షణంలో ఎన్నోమార్పులు వస్తున్నాయి. కానీ ఈ సిటీ బస్సులలో ఎలాటి మార్పు కనిపించడం లేదు. రాను రాను పరిస్థితి మరీ దుర్భరంగా తయారవుతోంది.

ప్రక్కనే ఆ ఒంది. తలా చూస్తే ఆ ... ఎం యిది ప్రభాకర్‌వున్నాడు. దాన్లో చెప్పాడు 'యీ మధ్యనే కొన్నాను. మా మామ కొనిపెట్టాడు.' అని వాళ్ళ మామను పదికాలాలపాటు క్షేమంగా చూడుకోమని భగవంతుణ్ని ప్రార్థించాను. రోడ్డుమీద అట్టే జన సంచారం లేకపోవడంవల్ల స్కూటర్ చాలా స్పీడుగా పోతోంది. ఆ స్పీడువల్ల రయ్ మని గాలి చెవులవద్ద రొదచేస్తోంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

'కొంచెం స్పీడు తగ్గించు నా కళ్ళు తిరుగుతున్నాయి" అన్నాను.

ప్రభాకర్ నవ్వి స్పీడు మరి కొంచెం ఎక్కువ చేస్తూ 'అమ్మాయిలా భయపడతా వేమిరా!' అన్నాడు. కళ్ళు తిరుగుతున్నట్లనిపించి కళ్ళు మూసుకున్నాను.

"మిసెస్ డిసిల్వా ప్రసవించిందా?" అడిగాను.

అతని మాటలు నాకు సరిగా వినపళ్ళేదు.

"అమ్మాయి వచ్చిపోయింది పాపం. అమ్మాయి అంటె ఆమెకు చాలా యిష్టం' అన్న మాటలు వినిపించాయి.

నా మనసంతా చిందరవందర రయిపోయింది. ప్రతిసారి యెందుకిలా జరుగుతోంది. ఆమె చేసిన నేరం ఏమిటి? ప్రతి స్త్రీ తల్లి కావాలని కలలు కంటుంది. మిసెస్ డిసిల్వా అలానే కలలు కన్నది. అది తప్పా?


నిలబడ్డాను, ఓ పద్ధెనిమిదేళ్ళ యువతి నా వద్దకొచ్చింది. బట్టలన్నీ చిరిగివున్నాయి. లెక్కలేనన్ని అతుకులున్నాయి ఆమె చీరె డాకెట్టుకూ. చేతిలో ఓ చాప. ఆ చాపలో ఓ చిన్న పాప.

ఆ చాపను నాకు బాగా దగ్గరగా చూపిస్తూ 'బాబూ పది పైసలియ్యండి పిల్లదానికి పాలు కొనుక్కుంటాను రెండురోజుల్నుంచి పాలు లేవు" అంది.

నా కళ్ళముందు మిసెస్ డిసిల్వా మెదిలింది. దిక్కూమొక్కూలేకుండా యిలా అడుక్కుతినే వాళ్ళకు పుట్టే పిల్లలు తిండిలేకపోయినా బ్రతుకుతారు. పుట్టిన పిల్లల్ని తిట్టుకుంటూ వాళ్ళను ఆధారంచేసుకుని వీళ్ళు బ్రతుకుతారు కానీ పిల్లల కోసం పిచ్చివాళ్ళలా తయారయ్యే మిసెస్ డిసిల్వాకు పుట్టిన పిల్లలు ఎందుకు బ్రతకడంలేదో? ఆమెను యింకా ఎంతకాలం పరీక్షిస్తాడో ఆ సృష్టికర్త?

నాలో గంతులేస్తున్న ఆలోచనలను అదిమిపెట్టుకుని ఆఫీసులోకి వచ్చాను. నా సీట్లోకూర్చుని డ్రాయర్లోంచి ఫైల్సుతీస్తూ ప్రక్కకు చూశాను. రామనాథం మరోవ్యక్తితో మాట్లాడుతున్నారు, ఆ కొత్తవ్యక్తి ఎవరో అనుకున్నాను.

'ఇతను మిస్టర్ రంగరాజుగారు టెంపరరీగా అపాయింట్‌చేశారు. మిసెస్ డిసిల్వా సీట్లో వని



చేస్తున్నారు" అంటూ రామనాథం అతన్ని పరిచయం చేశాడు.

రంగరాజుకు నవ్వడం హాబీకాబోలు. షేక్ హాండ్ యిస్తూ అమ్మాయిలా నవ్వాడు. బుగ్గలు సొట్టలు పడ్డాయి

"ఇంతకు ముందెక్కడయినా పనిచేశారా?"

నవ్వాడు. 'లేదండీ' అంటూ మళ్ళీనవ్వాడు అమ్మాయిలా.

ఇందాక ప్రభాకర్‌చెప్పిన విషయం జ్ఞప్తి కొచ్చింది.

మిసెస్ డిసిల్వా ప్రసవించిందట" అన్నాను

"ఎప్పుడోయ్" అన్నాడు రామనాథం ఆత్రంగా.

"తెలీదు. పాపం పుట్టిన పాప చచ్చిపోయిందట" అన్నాను.

'నీ కెవరుచెప్పారు" రామనాథం బాధగా అడిగాడు

ప్రభాకర్ చెప్పాడు" అన్నాను.

'ఇంతకుముందు పుట్టినపాపలుచనిపోయారు. ఇప్పుడు పుట్టిన పాపకూడా చనిపోయిందా ?"

'అవునట' అన్నాను.

మిసెస్ డిసిల్వాతో అంతగా పరిచయంలేని రంగరాజుకూడా చాలా సానుభూతి చూపాడు.

"వెడతానండి. అవతల రిప్లైచేయాల్సిన లెటర్సు చాలా వున్నాయి"అంటూ వెళ్ళిపోయాడురంగరాజు

ఓ గంటయాక ప్రభాకర్ నా దగరికొచ్చాడు ప్రక్కసీట్లో వున్న రామనాథం పని అయిపోవడం వల్ల పెన్‌తో టేబిల్‌మీద నెమ్మదిగా దరువు వేస్తున్నాడు.

'ఏమిటోయ్ మూర్తి, నా పరువు తీసేస్తున్నావ్' అన్నాడు బాంబ్‌షెల్ లా.

నా కర్థంకాక 'ఏమిటి ?' అన్నాను.

"మిసెస్ డిసిల్వా పాపచనిపోయిందని వాళ్ళకు చెప్పావుట ?'

'ఉదయం నువ్వే గదుటోయ్ చెప్పావ్" అన్నాను

ఇంతకుముందు పుట్టిన ముగ్గురు చనిపోయారని చెప్పానుగాని ఇప్పుడు పుట్టినపాప చనిపోయిందని చెప్పలేదు" అన్నాడు.

నాకేం సమాధానం చెప్పాలో తెలీలేదు. గుడ్లింత చేసుకుని ప్రభాకర్‌ను చూశాను.

'హ్యాటర్ చప్పుడువల్ల నేను సరిగా విన్లేదు" అన్నాను.

'ఇకముందయినా జాగ్రత్తగా విని యితర్లకు చెప్పు మహానుభావా' అన్నాడు. ప్రభాకర్ చిరునవ్వుతో.

'వెరీ సారీ" అన్నాను.

ఎవరో ఫ్రెండ్‌వస్తే ప్రభాకర్ వెళ్ళిపోయాడు.

లంచ్ అయ్యాక నేనూ, రంగనాథం మాట్లాడుకుంటున్నాం.

"మనసంతా అదోరకంగా వుందోయ్' అన్నాను.

"ఎందుకు ?"


"నా నోటితో ఆ అశుభం పలికినందుకు నాకు చాలా ఆందోళనగా వుంది ప్రభాకర్ చెప్పింది సరిగా వినకపోవడం నాదే పొరపాటు" అన్నాను.

"ఛ నువ్వంతగా ఎందుకు బాధ పడతావు. నీది యింత సున్నిత హృదయమని నే ననుకోలేదు పొరపాట్లు జరుగుతూనే వుంటాయి. అవంతా మనసులో పెట్టుకోకు" అన్నాడు.

రామనాథం వోదార్పు మాటలు నాకు వోదార్పును కలిగించలేదు. నా మనసులో ఒక మూల అర్థంకాని ఆవేదన తెరలు తెరలుగా లేచింది. గుండెదడ హెచ్చింది.

నాలుగురోజుల తర్వాత ప్రభాకర్ దారుణమైన వార్త చెప్పాడు-'మిసెస్ డిసిల్వాకు పుట్టిన పాప రాత్రి చచ్చిపోయింది" అని.

తుపానులో చిక్కుకున్న నావికుడిలా గిల గిల కొట్టుకున్నాను కళ్లు బైర్లుకమ్మాయి. కళ్ళముందు చిక్కటి చీకటి తెరలు సన్నగా వూగుతున్నట్టుగా వుంది. ఈసారి ఆ పాప చావుకు నేనే బాధ్యుణ్ణి. నా వల్లనే చనిపోయింది, నేనే చంపాను. మిసెస్ డిసిల్వా ఆనంద భాండంలో విషబిందువుల్ని చిలకరించింది నేనే.




ఒకతను కాఫీతెప్పించి సర్వర్‌ను పిలిచి ఇలా దులిపాడు

"ఇదటయ్యా కాఫీ ఇందులో ఈగ వుంది చూశావా"

"బేడ కాఫీకి ఈగలు కాకపోతే ఏనుగులు వొస్తాటయ్యా" అన్నాడు సర్వర్.

"మూర్తీ !' అన్న రామనాథం కంఠం వినిపించింది.

తల పక్కకు తిప్పి రామనాథంవైపు చూశాను.

"ఏం అలా వున్నావ్ ?"

"ఎలా వున్నాను ?"

"ఓ సారి అద్దంలో నీమొహం చూసుకో. నెల రోజుల్నుంచి వుపవాసం వున్న వాడిలా నీకళ్ళు పీక్కుపోయాయి, నిన్ను చూస్తుంటే భయం వేస్తోంది" అన్నాడు.

'మిసెస్ డిసిల్వా పాప చచ్చిపోయిందట" అన్నాను.

రామనాథం రెండు నిమిషాలు మౌనంగా వున్నాడు.

'ఇప్పుడర్థమయింది నువ్వెందు కిలావున్నావో. చూడుమూర్తి. నీకంటే వయస్సులో చిన్నవాడి కావచ్చు. కానీ కొన్ని విషయాలలో నీకంటే నాకు అనుభవం ఎక్కువ వుంది. జీవితంలో జరిగే ప్రతి చిన్న పొరపాటుకూ మనమే బాధ్యులము అన్న దృష్టితో ఆలోచిస్తే జీవితంలో ఒక్క సెంటీమీటరుకూడాముందుకు అడుగువేయలేము ప్రతిచిన్న విషయాన్ని మైక్రోస్కోప్‌క్రింద పెట్టి పరీక్షగాచూసే మన స్తత్వం వున్న మనిషి ఎప్పుడూ భవిష్యత్తులోకి చూడడు. కొన్ని సంగతులు మర్చిపోవాలి. అప్పుడే మనం వూపిరి పీల్చుకోగలం. మనకు తెలీకుండా చేసింది తప్పు అని నువ్వెందుకు అనుకుంటున్నావ్ ?" అన్నాడు

రామనాథానికి సమాధానం చెప్పడానికి నాకు వోపిక లేక పోయింది.

ప్రభాకర్ నెలరోజుల తర్వాత ఓ మధ్యాహ్నం పూట కంగారుగా నావద్దకు వచ్చాడు.

"మిసెస్ డిసిల్వాకు హిస్టీరియా అటాక్ వచ్చిందట. పాప పాప అని పలవరిస్తోందట. ఉండివుండి ఏడవటం, జుట్టు పీక్కోవడం, ప్లాస్టిక్ బొమ్మలతో ఆడుకోవడం. పెద్దగా అరవడం మొదలైనవన్నీ చేస్తోందట" అని చెప్పాడు.

నాకు కాళ్ళు చేతులు వణికాయి వణుకు. గుండెల్లో దడ వల్ల ఒక్క అక్షరంకూడా వ్రాయ లేక పోయాను. పర్మిషన్ తీసుకొని యింటికెళ్ళాను. నేను అలా చెప్పకపోతే పాప బ్రతికేదేమో ? మిసెస్ డిసిల్వాకు హిస్టీరియా వచ్చేది కాదేమో ?

రెండునెలలు సెలవు పొడిగించాక మిసెస్ డిసిల్వా ఆఫీసుకు వచ్చింది. మొదట్లో ఆమెను గుర్తుపట్టలేక పోయాను. సన్నగా అస్థిపంజరంలా వుంది. ఆమె కళ్ళలో యిదివరకటి కాంతిలేదు. వాటిలో యిదివరకటి జీవంలేదు. వస్తువుల్ని, మనుషుల్ని గుర్తుపట్టడానికి మాత్రమే పనికొచ్చేవిలా వున్నాయి ఆమెచూపులు ఆమెలో పరధ్యానం ఎక్కువయింది పలకరిస్తే పలుకుతుంది. లేకపోతే యంత్రంలా తనపని చేసుకుపోతుంది. రెండురోజులవరకు ఆమెను చూడడానికి ధైర్యం చాలలేదు. నేరంచేసినవాడిలా తప్పించుకు తిరిగాను. ఆమె అలా అవడానికి నేనే బాధ్యుణ్ణి అన్న వుద్దేశ్యం నాలో బలంగా నాటుకుపోయింది. మూడోనాడుఅనుకోకుండా క్యాంటీన్లోఎదురయింది. తల వొంచుకుని తప్పించుకుపోవడానికి అవకాశం లేకపోవడంవల్ల ఆగాను.

పేలవంగా నవ్వింది. అది నవ్వులా లేదు. పచ్చికతో కళకళలాడిన భూమి ఎండి బీటలు వారినట్టుగా వుంది. ఆ నవ్వు చిగురులేని ఎండిన చింత చెట్టులా వుంది.

"బావున్నారా ?" అన్నాను అతికష్టంమీద పెదాల చివర మాటలు జతచేసుకుని.

తల ఆడించింది.

నా కళ్ళు క్రిందికిమాశాయి.

"మీ పాప..."

మధ్యలోనే అందుకుని 'ఎవరో గిట్టనివాళ్ళు శాపంపెట్టి వుంటారు. దాని చావు కోరుకుని వుంటారు' అంది బలహీనంగా.

నా పరిస్థితి వర్ణించాలంటే భాష చాలదు. మార్ఫియా లేకుండా నన్ను కోస్తున్నట్టుగావుంది నా గుండెను చీల్చి నిర్దాక్షిణ్యంగా నేలమీద పడ వేసినట్టు అనిపించింది.

'వస్తాను" అంటూ నా సీటువద్దకొచ్చాను.

నన్ను అనాలని అన్నదా అన్న అనుమానం నన్ను తొలవసాగింది.

క్యాంటీన్లో మిసెస్ డిసిల్వా అన్న మాటలు రామనాథానికి చెప్పాను.

'నాన్సెన్స్. ఆమె కెవరు చెప్తారు. ఆమె విచారంలో వుండడంవల్ల అలా అని వుంటుంది" అన్నాడు.

రెండురోజులు శెలవుపెట్టి యింట్లోనే ఒంటరిగా కూర్చున్నాను.

కొన్నిరాత్రులు ఒకే రకమయిన కల... పొడుగాటి గోళ్ళతో వికృతంగావున్న నా చేతులతో యింకా కళ్ళు తెరవని రక్తంముద్దలావున్న మిసెస్ డిసిల్వా పాపను ఎత్తుకుని క్రిందవున్న అగాధమైన లోయలోకి విసిరినట్టు... పాప పాప అంటూ ఆ లోయ ప్రతిధ్వనించేట్టు మిసెస్ డిసిల్వా అరుపులు... ఆమె అరపులు ఎక్కువయ్యేకొద్దీ నా వికటాట్టహాసం ఎక్కువయినట్టు... ఆమె అరపులు ప్రపంచమంతా ఆవరించినట్టు... హఠాత్తుగా మెలకువ వచ్చేది తర్వాత కన్ను మూతపడేదికాదు.

ఉద్యోగం మానేసి ఈ వాతావరణానికి, ఈ జ్ఞాపకాలకు, ఈ వ్యక్తులకు చాలా దూరంగా ఎక్కడికయినా వెళ్ళిపోదామనిపించింది. నేనా పనిచేయకుండానే నాకు ప్రమోషన్ వచ్చింది. వైజాగ్‌లో వేశారు. వెళ్ళేటప్పుడు అందరికీ చెప్పి వెళ్ళాను.

వైజాగ్‌లో దాగానే వుండడంవల్ల నేను అనుభవిస్తున్న శిక్ష కొంతవరకు మర్చిపోయాను. మర్చి క్యాలండరు కనిపించినప్పుడు, పిల్లలులేనివాళ్ళను చూసినప్పుడు, హిస్టీరియావున్న ఆడాళ్ళను చూసినప్పుడు మనసంతా రంపంతో కోస్తున్నట్టుగా వుండేది.

పన్నెండేళ్ళు గడచిపోయాయి.

రామనాథానికి మంచి కంఠం వుండటంవల్ల. ఉద్యోగం మానేసి సినిమాల్లో ప్లేబాక్ పాడుతున్నట్టు తెలిసింది. అతన్ని కలుసుకోలేక పోయినా అతని గొంతు మాత్రం అప్పుడు వినే అదృష్టంకలుగుతుంది. రామనాథం పాటవింటుంటే గడచినరోజులు పాటలో పల్లవిలా పదేపదే జ్ఞాపకం కలుగుతుంది. రంగరాజు యింకా యూడీగా మగ్గుతున్నట్టు తెలిసింది. మిసెస్ డిసిల్వా ఉద్యోగానికి రాజీనామా యిచ్చిందని ప్రభాకర్ వ్రాశాడు కొంతకాలంనుంచి ప్రభాకర్ ఉత్తరాలు వ్రాయడం మానేశాడు. మిసెస్ డిసిల్వా ఏం చేస్తుందో, ఎక్కడుందో తెలుసుకోవాలని ఆరాటపడ్డ నాకు నిరాశేమిగిలింది. ఈ పన్నెండేళ్ళలో నేనుచేసిన ఘనకార్యాలు.

పెళ్ళిచేసుకున్నాను.

ముగ్గురు పిల్లల తండ్రినయ్యాను అయిష్టంగానే.

ముగ్గుర్ని నలుగురిగా చేయాలనే సంకల్పంతో మళ్ళా పుట్టింటి కెళ్ళింది మా ఆవిడ! బాధ్యతలు నెత్తిన పడటంవల్ల వెంట్రుకలు పల్చబడ్డాయి. అక్కడక్కడ తెల్లబడ్డాయి. అప్పుడప్పుడు ఆప్పటి ఆఫీసుజీవితం...ప్రభాకర్... రామనాథం...రంగరాజు... మిసెస్ డిసిల్వా...

* * *

"మిసెస్ డిసిల్వా" అన్నాను పెద్దగా.... అవం దంగా అది రైల్వేస్టేషన్ అన్న సంగతి పొత్తిగా మరచిపోయి

మిసెస్ డిసిల్వా నా దగ్గర కొచ్చింది పన్నెండేళ్ళ క్రితం ఫ్రాక్స్ వేసుకునే మిసెస్ డిసిల్వా ఇప్పుడు చీరెకట్టుకుంది. కళ్ళకు గోల్డుఫ్రేమ్ కళ్ళజోడు మొహంలో పరిపూర్ణత హుందాతనం కనిపించింది మనిషి నవ్వక పోయినా నవ్వినట్టుగా వుంది.

'మిస్టర్ మూర్తి మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను" అంది కళ్ళజోడు తీసి చీరె కొంగుతో

రాత్రిలో నాతి



—చిత్రం; వి. రామచంద్రరావు

తుడుచుకుంటూ.

"సగం ముసలివాడినై పోయాను గదూ" అన్నాను.

ఆమె నవ్వింది. ముందెప్పుడూ నవ్వనంత బిగరగా, అందంగా.

"నేనూ మీలానే అయిపోయాను" అంది

ఈసారి నవ్వడం నా వంతయింది.

మాట్లాడుకోవడం కంటే ఆ సమయంలో ఒకరి నొకరు నిశ్శబ్దంగా చూసుకోవడం బాగుంటుందనిపించింది.

"మీ పిల్లలా ?' అన్నాను.

"అవును" అంది విందుగా నవ్వుతూ.

బిస్కెట్స్ చాక్లెట్లు యింకేవేవో తినుబండారాలు పెట్టుకుని పోతున్న బండి కనిపించి కేక వేశాను.

మూడుచాక్లెట్‌డబ్బాలుకొని వాడికిడబ్బిచ్చాను

"ఇలారండి" అన్నాను పిల్లల్ని

తల్లి కొంగు పట్టుకున్న వాళ్ళు నన్నొక వింత కీటకంలా చూస్తున్నారు.

"మీరు చెప్పండి."

"ఆయన అంకుల్ మూర్తి. ఫర్వాలేదు వెళ్ళండి" అంది.

సందేహంగా చూస్తూ కుర్రాడు నావైపు రెండడుగులు ముందుకు వేశాడు. రెండో పాప నావద్ద కొచ్చింది. మూడో పాప మాత్రం నన్ను బూచి అనుకున్నట్టుంది. తల్లిని బల్లిలా కరుచుకుంది

ఇద్దరికీ చెరొక డబ్బా యిచ్చాను.

"మీ పాపకు మీరు యివ్వండి.' అంటూ మిసెస్ డిసిల్వా చేతికిచ్చాను.

ఇంతలో రైలు గంట కొట్టారు.

"అరరె! మా రైలువచ్చింది."అందికంగారుగా.

మిసెస్ డిసిల్వాను యింతకాలంతర్వాత కలుసుకుని ఏం మాట్లాడలేక పోయానే అని నాకు అసంతృప్తి కలిగింది.

ఆమె తన బ్యాగ్‌లోంచి ఓ విజిటింగ్‌కార్డుతీసి నాకిచ్చింది.

'వస్తామండి మిస్టర్‌మూర్తి బొంబేవస్తే తప్పకుండా మా యింటికిరండి. ఆ కార్డులో మా వారి అడ్రసు వుంది" అంది.

సామానులు తీసుకుని పోర్టర్ పోతున్నాడు.

వెనక్కు తిరిగి చూసుకుంటూ మిసెస్ డిసిల్వా వెడుతోంది.

ఆమె వెనక పిల్లలు కోడిపెట్టవెంట కోడిపిల్లల్లా వెడుతున్నారు.

అశాంతితో నిండిన నా మనసు ప్రశాంతంగా హాయిగా వుంది

కెరటాలకు కుదుటపడ్డ సముద్రపు బొడ్డుకంటే నిర్మలంగా వుంది నా హృదయం.

ఏదో నేరంచేసిన నేరస్తుడిలా అంతరాత్మతో రాజీకుదరక బాధపడుతున్న నాకు ప్రకృతంతా కళకళ లాడుతున్నట్టు మనుషులంతా ఆనందంగా వున్నట్టు అనిపించింది.

మిసెస్ డిసిల్వా ఎక్కిన రైలు వెళ్ళిపోయింది.

హాయిగా గాలి పీల్చుకుని జేబులో వున్న విజిటింగ్ కార్డు తీశాను.

డి. రామశాస్త్రి

జనరల్ మేనేజర్

భారత్ లివర్ ప్రొడక్ట్స్

ఫోర్ట్—బొంబాయి-1.

అని వుంది.

నా కాశ్చర్యం వేసింది.

మిసెస్ డిసిల్వా మళ్ళా పెళ్ళి చేసుకుందా ? ఎందుకు?

డిసిల్వా అంటే యిష్టంలేకనా?

పుట్టిన పిల్లలంతా చచ్చిపోతున్నారన్న సెంటిమెంటు వల్లనా?

ఏమో ?

నా కర్థంకాదు.

అంతలో టికెట్ల గంట కొట్టారు.

లేచాను. ☆